క్లుప్తంగా

ఉపాధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని 31 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద మంజూరైన వివిధ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.రమేష్ సూచించారు. ఏపీఓ తేజ ఆధ్వర్యంలో క్షేత్ర సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోప్ పిట్లు, గోశాల పనులు, కాంపౌండ్ వాల్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

మోసాలకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్

కొమరాడ: మండలంలోని తొడుము గ్రామ పంచాయతీ కార్యదర్శిని గుర్తు తెలియని వ్యక్తి ఇటీవల ఫోన్‌లో బెదిరించి రూ.24వేలు దోచుకున్న ఘటనలో ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ కె.నీలకంఠం బుధవారం తెలిపారు. తాను ఉన్నతాధికారినని కార్యదర్శిని బెదిరించి మోసం చేసిన కేసులో అందిన ఫిర్యాదు మేరకు పార్వతీపురం సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లాకు చెందిన కురవి మండలం తాటియా తండాకు చెందిన బాణోతు రమేష్ ఈ మోసానికి బాధ్యుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రమేష్ బీటెక్ చదివాడని, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి మోసాలు చేసేందుకు అలవాటు పడినట్టు తమ దర్యాప్తులో తేలిందన్నారు. కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ



విగ్రహాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

భామిని: మండలంలోని బాలేరులో చెవిటమ్మ తల్లి విగ్రహంతో పాటు యోగనిద్రలో ఉన్న మహాశివుడి విగ్రహాలను బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ముందుగా విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం పవిత్ర జలాలతో విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అమానుషం



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

గుమ్మలక్ష్మీపురం: మన్యం జిల్లా మక్కువ మండలంలో ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడికి పాల్పడిన టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడును చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ దాడిని నిరసిస్తూ గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎస్.శ్రీనివాసరావు, బేత కుమారస్వామి, జి.పెంటయ్య, టి.రవికుమార్, కె.రాము, పి.ప్రేమానంద్ తదితరులు మాట్లాడుతూ ప్రజల గొంతుకై ప్రశ్నించే జర్నలిస్టులపై దాడులు మంచి పరిణామం కాదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉప తహసీల్దార్ ఎస్.శేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి

- ఎంపీడీఓ రంగారావు



పిల్లల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీస్తున్న ఎంపీడీఓ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్య సంరక్షణపై సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ వీవీ.రంగారావు అన్నారు. మండలంలోని తంపటాపల్లి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, ఉపాధి, ఇంకుడు గుంతల పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం అక్కడి జెడ్పీ ఉన్నత పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సారా పట్టివేత

కొమరాడ: మండలంలోని రాజ్యలక్ష్మీపురం గ్రామ సరిహద్దులో బుధవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సారా రవాణా చేస్తున్న ఉదయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. 80 లీటర్ల సారాను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.సింహాద్రి, హెచ్‌సీ జి.సుదర్శన్‌కుమార్, కానిస్టేబుళ్లు ఎల్.జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కొమరాడ: అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎంఈఓ స్వామినాయుడు



గరుగుబిల్లి: శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ తిరుపతినాయుడు





జియ్యమ్మవలస: జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ రెడ్డి తేజేశ్వరరావు

గరుగుబిల్లి: జ్ఞానజ్యోతి శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి నల్ల తిరుపతినాయుడు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజులలో అంగన్‌వాడీ కేంద్రాలు పాఠశాలలతో అనుసంధానం కానున్న తరుణంలో గతంలో పాఠశాల ఉపాధ్యాయులకిచ్చే శిక్షణ విధంగానే అంగన్‌వాడీలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణలో నేర్చుకొన్న అంశాలను వినియోగించుకొని మంచి విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 దత్తి అప్పలనాయుడు, ఎంఈఓ-2 కె.కొండలరావు, హెచ్‌ఎం ఎస్‌ఎల్.పాత్రుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, రిసోర్సు పర్సన్‌లు వి.ధనుంజయనాయుడు, పి.వెంకటనాయుడు, కె.సింహాచలం తదితరులున్నారు.

జియ్యమ్మవలసలో..

జియ్యమ్మవలస: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ రెడ్డి తేజేశ్వరరావు బుధవారం పరిశీలించారు. రెండు విడతల్లో 115 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఆయనతో పాటు కోర్సు డైరెక్టర్ ఎంఈఓ -2 శ్రీనివాసరావు, ఏపీఓ కేబీ హరిప్రసాద్ పాల్గొన్నారు.

కొమరాడలో..

కొమరాడ: అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్ పిల్లలకు చక్కని విద్యాబుద్ధులు నేర్పించాలని ఎంఈఓ స్వామినాయుడు అన్నారు. కొమరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ పీఓ సుగుణ కుమారి ఆధ్వర్యంలో కార్యకర్తలకు బుధవారం నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఈఓ అప్పలనాయుడు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : పీఓ



గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీ వాస్తవ అన్నారు. కురుపాం ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ అధికారుల సమావేశంలో పాల్గొన్న పీఓ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకంతో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేలా లబ్ధిదారులకు ప్రోత్సాహం అందించాలన్నారు. గృహ నిర్మాణాల ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం పీసా చట్టంపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులకు అందజేస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరి, హౌసింగ్ ఏఈ అచ్చాయమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ముక్కిడి పోలమ్మ జాతర

సీతంపేట: మండలంలోని పులిపుట్టి పంచాయతీ పరిధిలోవేంచేసి ఉన్న ముక్కిడిపోలమ్మ జాతర గురువారం నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రానున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

లక్ష్మీ సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం



లక్ష్మీ సంతోషిమాత

వీరఘట్టం: మండల కేంద్రంలోని లక్ష్మీ సంతోషి మాత ఆలయ 15వ వార్షికోత్సవం గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రెండు రోజులు సంతోషి మాత దీక్షలు చేపట్టే భక్తులచే ప్రత్యేక పూజలు, ,హోమాలు, తదితర కార్యక్రమాలను యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ముగింపు రోజు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పర్యాటకులను ఆకర్షించేలా పార్కును తీర్చిదిద్దండి



ఎస్‌కే పాడు పార్క్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ

గుమ్మలక్ష్మీపురం: అడ్వెంచర్ పార్కులో బోటు షికారు నిర్వహిస్తున్న చెరువును పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. ముందుగా టిక్కబాయి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల్లో సామర్థ్యాలను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఎస్‌కే పాడులోని ఐటీడీఏ అడ్వెంచర్ పార్కును సందర్శించారు. బోటు షికారు నిర్వహిస్తున్న చెరువు పూడికలతో నిండి ఉండడం గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ వాటర్ అవార్డు 2024కు నామినేట్ చేయబడిన మంగళాపురం, పెదఖర్జ గ్రామాల్లోని రాక్‌ఫిల్ డ్యాం, పెర్క్యులేషన్ ట్యాంకు పనులను పర్యవేక్షించి సంబంధిత గ్రామ వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్, సభ్యులతో మాట్లాడారు. పనుల ప్రగతి గూర్చి ఆరా తీశారు. ఆయన వెంట వాటర్‌షెడ్ పథకం ఏపీడీ ఆర్.సురేష్‌నాయుడు, పీఓ ఆర్.పోలినాయుడు, సిబ్బంది ఉన్నారు.

రక్తహీనత నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ వైద్యాధికారి రాంప్రసాద్ సాహూ

జియ్యమ్మవలస: రక్తహీనత కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పార్వతీపురం, విజయనగరం ఉమ్మడి జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ వైద్యాధికారి డాక్టర్ రాంప్రసాద్ సాహూ సూచించారు. బుధవారం చినమేరంగి సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో ఉంటున్న విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. వసతిగృహంలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి తెలియజేశారు. కార్యక్రమంలో వార్డెన్ శంకరరావు పాల్గొన్నారు.

ముదిలి కుటుంబాన్ని పరామర్శించిన పుష్పశ్రీవాణి



ముదిలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని జోగులడమ్మ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ముదిలి సింహాచలం మాతృమూర్తి ముదిలి అమ్మనమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కొండచిలకాంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కద్రక బలరాం అనారోగ్యానికి గురవడంతో ఆ కుటుంబాన్ని కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోట రమేష్‌నాయుడు, నాయకులు లోలుగ నారాయణ, ఎం.కిశోర్, రాయగడ శేఖర్, అల్లు ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు



అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని తుంబలి గ్రామ సమీపంలో సింకి చెరువు దిగువ బంజరమెరకలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. వారం రోజులుగా ఈ తవ్వకాలు రాత్రి పగలు జరుగుతున్నా రెవెన్యూ శాఖాధికారులు గుడ్లప్పగించి చూస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా కొందరు రాజకీయ నేతల అండదండలతో ఈ తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల బీజేపురం పంచాయతీ లోతువానివలస, పెదమేరంగి కూడలి నుంచి బాసింగి గదబవలస రహదారి నిర్మాణ పనులకు ఈ గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఇంత జరుగుతున్నా గ్రావెల్‌కు దగ్గరలో ఉన్న జియ్యమ్మవలస రెవెన్యూ శాఖాధికారులకు తెలియకపోవడం శోచనీయం. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దార్ రెడ్డి పకీరు మాట్లాడుతూ బుధవారమే తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. దీనిపై సంబంధిత వీఆర్‌ఓను పిలిచి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆదేశించినట్టు చెప్పారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్



దోమల నియంత్రణ మందు ఫాగింగ్ చేయిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: పట్టణంలో విజంభిస్తున్న దోమల నియంత్రణపై నగర పంచయతీ అధికారులు దృష్టి సారించారు. ఈ మేరకు వివిధ వార్డుల్లో బుధవారం పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయించిన అధికారులు.. సాయంత్రం పట్టణంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేపట్టారు. రోడ్లపై చెత్త వేయరాదని ఈ సందర్భంగా సిబ్బంది ప్రజలకు సూచించారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

25లోగా ఆన్‌లైన్ చేయించుకోవాలి

- ఏఓ ఎన్ని వాహిని



గేదెల వారి వీధిలో రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయిస్తున్న వ్యవసాయ సహాయకులు

పాలకొండ రూరల్: విశిష్ట రైతుసేవా గుర్తింపు సంఖ్య పొందేందుకు రైతులు పూర్తి వివరాలతో ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఎన్ని వాహిని అన్నారు. మండల కేంద్రంలోని కాపువీధి, గేదలవారివీధి, లుంబూరువారి వీధితో పాటు మండలంలోని అంపిలి, అన్నవరం, గురుగుబిల్లి గ్రామాలలో బుధవారం ఆమె పర్యటించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ రిజిస్ట్రీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలో దాదాపు 9 వేల పైచిలుకు రైతులు ఉండగా ప్రస్తుతం 62 శాతం మంది ఆన్‌లైన్ నమోదు చేయించుకున్నట్లు తెలిపారు. మిగిలిన రైతులు వారికి సంబంధించిన సేవా కేంద్రాల ద్వారా ఈ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు. రైతులు తమ ఆధార్, పట్టాదారు పాస్ బుక్ లేదా వన్ బీ, ఆధార్ అనుసంధానంతో కూడిన సెల్ నంబర్‌తో రైతుసేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

● ఎన్నికల ప్రచారం..



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరి పాలకొండ పట్టణంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తనకు అవకాశం కల్పిస్తే ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని కోరారు. ఈమె వెంట జేవీకే ప్రతినిధులు మహేష్, యూటీఎఫ్ జిల్లా నాయకులు ఎం.పైడిరాజు, నాగేశ్వరరావు, తదితరులున్నారు.

- పాలకొండ రూరల్

చిన్నారులు పాఠశాలల్లో చేరేలా ప్రయత్నించండి

- జిల్లా బాలల సంరక్షణ లీగల్ ఆఫీసర్ శ్రీధర్



మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్

వీరఘట్టం: అంగన్‌వాడీ కార్యకర్తలు బడి బయట ఉన్న చిన్నారులను గుర్తించి పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా బాలల సంరక్షణ లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్ సూచించారు. బుధవారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ వద్దకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు మరికొన్ని ముఖ్యమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తత ఇచ్చుట, మహిళలపై జరిగే గృహహింస, వరకట్న వేధింపులను అడ్డుకోవడం, ఆడపిల్లలను హాస్టల్స్‌లో చేర్పించడం, కిషోర బాల,బాలికల ఆరోగ్య పరిరక్షణకు పాటుపడడం, బాల్య వివాహాల నిర్మూలన, తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి హరికృష్ణ, ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు, డీఆర్‌పీలు మజ్జి పైడిరాజు, ఆర్.ధనుంజయనాయుడు, బి.రాజేష్, సూపర్‌వైజర్లు ఎస్.రాజశ్వేరి, జె.జ్ఞానమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటనల పన్నుకు గెజిట్ నోటిఫికేషన్



నోటీస్ బోర్డులో ప్రకటనల పన్నుల వివరాలు ప్రదర్శిస్తున్న కమిషనర్, తదితరులు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలో వివిధ వ్యాపార సంస్థల ప్రకటనలకు సంబంధించి పన్నుల వివరాలతో కూడిన గెజిట్ నోటిఫికేషన్ బుధవారం విడుదల చేసినట్లు కమిషనర్ సామించి సర్వేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ప్రతి సంవత్సరం వసూలు చేస్తున్న ప్రకటనల పన్నుల తాజా వివరాలతో కూడిన గెజిట్ కార్యాలయ నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు చెప్పారు. దుకాదారులు ఈ వివరాల మేరకు ప్రకటన పన్ను చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ టి.జయరాం, టీపీఓ యూడీ షారుఖ్‌ఖాన్, రెవెన్యూ సిబ్బంది ఐ.శ్రీహరి, తదితరులున్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడుతా..

- ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

సీతంపేట: విద్యారంగ సమస్యలపై పోరాడి పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. మండలంలోని సీతంపేట, మల్లి, తదితర ఆశ్రమ పాఠశాలల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు పోరాడుతానని చెప్పారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులను రెగ్యులర్ చేసేలా ప్రయత్నిస్తానని.. ప్రతి ఒక్కరూ మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఆరిక భాస్కరరావు, కుండంగి కృష్ణారావు, పి.కృష్ణారావు, బి.జయప్రకాష్, రాజకుమారి, విశాలక్ష్మి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల గొంతుకనవుతా..

భామిని: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే అధ్యాపకులు, ఉపాధ్యాయుల గొంతుకనవుతానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరీ అన్నారు. మండలానికి చెందిన యూటీఎఫ్ నాయకులతో కలిపి ప్రభుత్వ విద్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదటి ప్రాధాన్యత ఓటు తనకు వేయాలని కోరారు. ఆమె వెంట యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాష్, మండల కార్యవర్గం, టీచర్లు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెదమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు పి.పార్వతి ఆధ్వర్యంలో బుధవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ ప్రచారం నిర్వహించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో రఘువర్మను గెలిపించాలని కోరారు. ప్రచారంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మద్రాపు మహేష్, ఉపాధ్యక్షుడు సత్యన్నారాయణ, జిల్లా సీనియర్ నాయకులు గుల్ల దాలినాయుడు, నరసింహ చౌదరి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు నిధులు కేటాయించాలి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల పాలనలో ప్రజలకు ఒనగూర్చింది ఏమీ లేదని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ఆరోపించారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. సూపర్ సిక్స్‌తో పాటు మేనిఫెస్టోలో ఇచ్చిన ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రతీ దానికి గత ప్రభుత్వ వైఫల్యం అంటూ పదేపదే కూటమి నేతలు చెబుతుండడం తమ బాధ్యత నుంచి తప్పించుకోవడమేనని దుయ్యబట్టారు. త్వరలో ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి వంటి సంక్షేమ పథకాలకు తగినన్ని నిధులను కేటాయించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు.